ఎన్ని జిమ్మిక్కులు చేసినా వైఎస్సార్ సీపీదే గెలుపు

- కూటమి అభ్యర్థులకు ప్రజలే బుద్ధి చెబుతారు
- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు


వైఎస్సార్‌సీపీ జెండాలు, హారతితో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు స్వాగతం పలుకుతున్న నాయకులు, కార్యకర్తలు

మధురవాడ: ప్రతిపక్షాలు ఎన్ని కూటములు కట్టినా.. ఎంత మంది కలిసి వచ్చినా మళ్లీ భీమిలిలో వైఎస్సార్‌సీపీదే గెలుపు అని, మళ్లీ ఎగిరేది మా జెండాయేనని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. కూటమి అభ్యర్థులకు ప్రజలే ఓటుతో బుద్ధి చెబుతారన్నారు. జీవీఎంసీ 7వ వార్డు మధురవాడ ఆర్‌టీసీ కాలనీ, మల్లయ్యపాలెంలో గురువారం ఇంటింట ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వడగాల్పులు, మిట్ట మధ్యాహ్నం మండుటెండని సైతం లెక్కచేయకుండా ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందజేశారు. ఫ్యాన్ గుర్తుపై ఓటేసి మరోసారి తనను ఎమ్మెల్యేగా, ఎంపీగా బొత్స ఝాన్సీలక్ష్మిని భారీ మెజార్టీతోనే గెలిపించాలని కోరారు. నియోజకవర్గంలో ఎక్కడికి వెళ్లినా ప్రజలు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నాయకత్వం పట్ల అత్యంత విశ్వాసం, నమ్మకాన్ని ప్రకటిస్తున్నారన్నారు. మళ్లీ ఆయన్నే ముఖ్యమంత్రిని చేసుకుంటామని చెబుతున్నారన్నారు. నియోజకవర్గంలో రూ.2,700 కోట్లతో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలే తమకు విజయ సోపానాలన్నారు. టీడీపీ అభ్యర్థి నాలుగు రోజుల క్రితం వచ్చి నామినేషన్ వేసి ఎమ్మెల్యే అయిపోదామనుకుంటే ప్రజలు మోసపోవడానికి సిద్ధంగా లేరన్నారు. తాము ఐదేళ్ల పాటు ప్రజలకు నిత్యం అందుబాటులో వున్నామని, కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో కూడా సేవలు అందించామన్నారు.

తాము అవినీతి, ఆశ్రిత పక్షపాతం, రాజకీయాలు చూడకుండా నిష్పాక్షిక పాలన అందించిన విషయం అందరికీ తెలుసన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఖచ్చితంగా మరోసారి ముఖ్యమంత్రి అవ్వడం ఖాయమని, విశాఖను పరిపాలన రాజధాని చేసి ఇక్కడి నుంచే పాలన సాగిస్తారన్నారు. కార్యక్రమంలో ఏపీ నగరాలు కార్పొరేషన్ చైర్మన్ పోతిన శ్రీనివాసరావు, నాయకులు వంకాయల మారుతీప్రసాద్, పిళ్లా సూరిబాబు, జగ్గపిల్లి నరేష్, కుడితి రామారావు, అల్లాడ వెంకటరావు, కె.శ్రీదేవి, తమ్మినేని వరలక్ష్మి, పసుపులేటి గోపి, ఎస్.నాగభూషణరావు, పిళ్లా రామణ, తదితరులు పాల్గొన్నారు.

సాయిరాం కాలనీలో ఇంటింటా ప్రచారం

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు సాయిరాం కాలనీలో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందజేసి వైఎస్సార్ సీపీ అభ్యర్థులను ఆశీర్వదించాలని అభ్యర్థించారు. ఫ్యాన్ గుర్తుపై ఓటేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా బొత్స ఝాన్సీలక్ష్మిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా జీవీఎంసీ 5వ వార్డులోని శారదానగర్, ఆర్‌జీకే కాలనీ, పీపీ 2 కాలనీ, సాయిరాం కాలనీకి చెందిన 20 కుటుంబాల వారికి వైఎస్సార్ సీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మాజీ కార్పొరేటర్ పోతిన హనుమంతురావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పోతిన సురేష్, కె.శ్యామలరావు, పోతిన పాత్రుడు, వైఎస్ మూర్తి, జోజిబాబు, జగన్, నారాయణరావు, శ్రీనివాస్, నాయుడు, ఎన్.బాబ్జి, జేఎస్ రెడ్డి, ముచ్చు రామారావు, బోయి సూర్రెడ్డి, కూన రమణ, ఎం.రమణమ్మ, గాయత్రి, బగాది లక్ష్మణ, తదితరులు పాల్గొన్నారు.


మల్లయ్యపాలెంలో ప్రచారంలో మహిళలతో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు


మధురవాడలో మహిళకు కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు


ఆర్‌టీసీ కాలనీలో వృద్ధురాలికి కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

24న భీమిలిలో నామినేషన్ వేస్తా


సాయిరాం కాలనీలో ఓ గృహిణికి కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

ఈ నెల 24న మధ్యాహ్నం తాను భీమిలిలోనే నామినేషన్ వేస్తానని, ఇక్కడి నుంచే పోటీ చేసి మళ్లీ ఎమ్మెల్యేగా గెలుస్తానని ముత్తంశెట్టి శ్రీనివాసరావు ధీమా వ్యక్తం చేశారు. ఎక్కడకు వెళ్లినా తమకు, తమ పార్టీ నాయకులకు ప్రజలు ఘన స్వాగతం పలుకుతూ ఆదరిస్తున్నారని పేర్కొన్నారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాలని అంతా కృతనిశ్చయంతో వున్నారని చెప్పారు. ఆయన ముఖ్యమంత్రిగా విశాఖలోనే ప్రమాణ స్వీకారం చేస్తారన్నారు. త్వరలోనే విశాఖకు పరిపాలన రాజధాని వస్తుందని, తద్వారా ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు.

క్లుప్తంగా

వలంటీర్ల మూకుమ్మడి రాజీనామా


రాజీనామా పత్రాలు అందజేస్తున్న వలంటీర్లు

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డులో మూడు రోజుల నుంచి వలంటీర్ల రాజీనామాలు కొనసాగుతున్నాయి. ఈ సార్వత్రిక ఎన్నికల్లో జగనన్నకు సైనికుల్లా పనిచేసేందుకు రాజీనామా చేసి ముందుకు వస్తున్నట్లు వలంటీర్లు తెలిపారు. ఈ నేపథ్యంలో గురువారం జేవీ అగ్రహారం, నిడిగట్టు సచివాలయం పరిధిలో వలంటీర్లు అందరూ ఒక్కసారిగా రాజీనామా చేశారు. సంక్షేమ పాలనకు మద్దతుగా వైఎస్సార్‌సీపీకి తమవంతు సహకారం అందిస్తామని వీరు పేర్కొన్నారు.

కూటమి ప్రచారానికి బీజేపీ దూరం

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డులో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిలో ముసలం ప్రారంభమైంది. టీడీపీ నాయకులు బీజేపీ వారికి సమాచారం, గౌరవం ఇవ్వడం లేదని... అందుకే ఇక నుంచి వార్డులో నిర్వహించే ప్రచారానికి దూరంగా వుంటామని బీజేపీ నాయకులు చెబుతున్నారు. గురువారం భీమిలిలో కూటమి అభ్యర్థి గంటా శ్రీనివాసరావు నామినేషన్‌కు కూడా 4వ వార్డుకు చెందిన బీజేపీ జిల్లా యూత్ అధ్యక్షుడు దోని నాగరాజు, ఆయన అనుచరులు దూరంగా ఉన్నారు. ఇదే తరహాలో జనసేన నాయకులు కూడా మనోవేదనకు గురవుతున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.

అక్రమంగా మద్యం తరలిస్తున్న మహిళపై కేసు

పద్మనాభం: మండలంలోని తునివలస పంచాయతీ నరసాపురంలో గురువారం అక్రమంగా మద్యం తరలిస్తున్న ఒక మహిళను పట్టుకుని కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు. నరసాపురం గ్రామానికి చెందిన బత్తుల సత్యవతి 15 మద్యం బాటిళ్లు పట్టుకుని గ్రామంలోకి వెళ్తుండగా పట్టుకుని సీజ్ చేసినట్టు పోలీసులు తెలిపారు.

మట్టి లారీలు సీజ్



మట్టితో సీజ్ చేసిన లారీలు

పద్మనాభం: మండలంలోని రెండు జంక్షన్లలో గురువారం వాహనాలు తనిఖీ చేస్తుండగా ఎటువంటి అనుమతులూ లేకుండా మట్టి తరలిస్తున్న నాలుగు లారీలు సీజ్ చేసినట్టు సీఐ సీహెచ్.శ్రీదర్ చెప్పారు. పద్మనాభం, రేవిడి జంక్షన్ల వద్ద ఈ లారీలు పట్టుకుని సీజ్ చేసినట్టు ఆయన తెలిపారు. లారీలను తహసీల్దార్‌కు అప్పగించినట్టు తెలిపారు.

సిరులతల్లికి పంచామృతాభిషేకం

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో 10 మంది ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీనివాసుల రెడ్డి, ఏఈవో తిరుమలేశ్వరరావు పాల్గొన్నారు.

లో ఓల్టేజీతో ఇబ్బందులు


గొట్టిపల్లిలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

ఆనందపురం : మండలంలోని గొట్టిపల్లిలో లో ఓల్టేజీ సమస్యతో ఇబ్బంది పడుతున్నామని, విద్యుత్ శాఖ అధికారులు స్పందించి పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ప్రస్తుతం ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ కెపాసిటీ చాలకపోవడంతో లో ఓల్టేజీ సమస్య తలెత్తుతోందని... ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లు, ఫ్రిడ్జ్‌లు, ఇతర ఎలక్ట్రికల్ సామాన్లు కాలిపోతున్నాయని, తీవ్రంగా నష్టపోతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ కెపాసిటీ చాలలేదని ఏడాది కాలం నుంచి సమస్యను అధికారులకు వివరిస్తున్నా పట్టించుకోలేదని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని గొట్టిపల్లి గ్రామస్తులు కోరుతున్నారు.

తప్పిన పెను ప్రమాదం


బీచ్‌రోడ్డులో నేలకొరిగిన విద్యుత్ స్తంభం

కొమ్మాది: సాగర్‌నగర్ బీచ్ రోడ్డులో గురువారం పెను ప్రమాదం తప్పింది. విజయనగరం నుంచి బీచ్ రోడ్డు మీదుగా వస్తున్న ఎలక్ట్రికల్ కారు జూ పార్కు వద్ద టైరు పేలిపోవడంతో అదుపు తప్పి రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్‌ను ఢీకొట్టి, దానిపై ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ సంఘటనలో విద్యుత్ స్తంభం ఒక్కసారిగా నేలకొరిగిపోయింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఎవరికీ ప్రాణాపాయం లేకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

ప్రపంచ వ్యాప్తంగా 800 పురాతన కట్టడాలు

తగరపువలస: ప్రపంచ వ్యాప్తంగా 800 వరకు పురాతన కట్టడాలు, స్థలాలు వుండగా అందులో 40 మన దేశంలోనే వున్నట్లు యునెస్కో గుర్తించిందని బంగ్లామెట్ట జీవీఎంసీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు అన్నారు. వాటిలో ఆగ్రా, కోట, అజంతా, ఎల్లోరా గుహలు, ఖజరహో, తాజ్‌మహల్, మహాబలిపురం, గోవా చర్చ్‌లు, హంపి కట్టడాలు ఉన్నాయన్నారు. గురువారం ప్రపంచ వారసత్వ దినోత్సవం సందర్భంగా వీటిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ పురాతన కట్టడాలు, స్థలాల పరిరక్షణ సంఘం సంయుక్తంగా 1982లో ఆఫ్రికాలోని ట్యునీషియాలో సమావేశం ఏర్పాటు చేసిందన్నారు. అప్పటి నుంచి ప్రపంచ వారసత్వ దినోత్సవం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరహరిశెట్టి రమేష్, బుగత మల్లిక, పిన్నింటి నాగమణి పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

తగరపువలస: చిట్టివలస రూరల్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విశాఖ ఆపరేషన్ జోన్ – 3 ఈఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. ఈ అంతరాయం 33 కేవీ దాకమర్రి సబ్‌స్టేషన్, 11 కేవీ బోడమెట్టపాలెం, 33 కేవీ చిప్పాడ సబ్‌స్టేషన్, 11 కేవీ అన్నవరం ఫీడర్లకు వర్తిస్తుందన్నారు. ఈ కారణంగా అల్లుపేట, భూ మాత లే అవుట్, దాసరిపేట, ముద్దాడపేట, రామునాయుడుపేట, బోడమెట్టపాలెం, రెల్లిపేట, నీలయమ్మసత్రం జంక్షన్, ఆశిపాలెం, నమ్మివానిపాలెం, కొసనవాని పాలెం, కంచేరుపాలెం, గొల్లపాలెం, ఎర్రయ్యపాలెం, అన్నవరం, కొత్త గొల్లపేట, పాతపాలెం, జీరుపాలెం, పెద నాగమయ్యపాలెం, చిన నాగమయ్యపాలెం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని తెలిపారు.

కొమ్మాది సబ్ స్టేషన్ పరిధిలో...

మధురవాడ: ఏపీ ట్రాన్స్‌కో కొమ్మాది విద్యుత్ సబ్ స్టేషన్‌నందు అదనపు ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, నిర్వహణ, మరమ్మతులు చేపడుతున్న కారణంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతోందని అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నరేష్ చెప్పారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు కొమ్మాది జంక్షన్, శ్రీనివాసనగర్, సాయిరాం కాలనీ, జీసీ లే అవుట్, టీచర్స్ లే అవుట్, హౌసింగ్ బోర్డు కాలనీ, అమరావతినగర్ కాలనీ, సేవానగర్, సాయిరాం కాలనీ, డ్రైవర్స్ కాలనీ, కొమ్మాది విలేజ్, దేవిమెట్ట, ఓజోన్ వేలీ బ్లాకులు, కుక్కలు కంపెనీ, కొమ్మాది, కొమ్మాది కే1, కే2, కే3 కాలనీ, నవోదయ స్కూలు, బక్కన్నపాలెం పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని, వినియోగదారులు సహకరించాలని నరేష్ కోరారు.

అడుగడుగునా నిబంధనల ఉల్లంఘనలు

- గంటా నామినేషన్‌కు జనాన్ని తరలించిన కూటమి నాయకులు
- రోడ్డు మధ్యలోనే కార్యకర్తల వాహనాల పార్కింగ్


మారికవలస - తిమ్మాపురం రోడ్డు మధ్యలో ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేసిన కార్యకర్తలు


ఎండ వేడిమికి గ్రంథాలయం వద్ద సేద తీరుతున్న మహిళలు


కొమ్మాది జంక్షన్ వద్ద కూలీలతో బేరమాడుతున్న టీడీపీ కార్యకర్తలు

భీమునిపట్నం : ఐదేళ్లకోసారి నియోజకవర్గం మార్చి... ఎన్నికల్లో డబ్బు సంచులతో ప్రజాభిప్రాయాన్ని ప్రభావితం చేయొచ్చని భావించే గంటా శ్రీనివాసరావు... గురువారం నామినేషన్ దాఖలు చేశారు. అయితే అడుగడుగునా టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు నిబంధనలు ఉల్లంఘించారు. గురువారం ఉదయం 11 గంటలకు భీమిలిలోని క్యాంపు కార్యాలయం ఎదురుగా ఉన్న ఖాళీ ప్రదేశంలో నాయకులు, కార్యకర్తలతో నిర్వహించే సభలో మాట్లాడిన తర్వాత నామినేషన్‌కు ర్యాలీగా వెళ్లడానికి గంటా నిర్ణయించారు. దీంతో నియోజకవర్గ పరిధి నుంచి పలువురిని నాయకులు తరలించి తీసుకొచ్చారు. అయితే మధ్యాహ్నం 12 : 30 గంటల వరకు గంటా రాకపోవడంతో ఎండ వేడిమికి మహిళలు, వృద్ధులు సొమ్మసిల్లి కిందపడిపోయారు. మరికొందరు సమీపంలోని గ్రంథాలయం, దానిపక్కన చెట్ల కింద సేద తీరారు. షెడ్యూల్‌కు భిన్నంగా గంటా నేరుగా నామినేషన్ వేయడానికి వెళ్లిపోయారు. దీంతో అప్పటికే నీరసించిపోయిన కార్యకర్తలు, డబ్బులిచ్చి తరలించిన జనం ఆర్‌డీవో కార్యాలయానికి వెళ్లలేక తమ ఇళ్లకు బయలుదేరిపోయారు. ఆర్‌డీవో కార్యాలయంలో ఎన్నికల నిర్వహణ అధికారి ఎస్.భాస్కరరెడ్డి సమక్షంలో గంటా శ్రీనివాసరావు నామినేషన్ దాఖలు చేశారు. నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కోరాడ రాజబాబు, జనసేన ఇన్‌చార్జి పంచకర్ల సందీప్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

డబ్బులిచ్చి కూలీల తరలింపు

మధురవాడ: కూటమి అభ్యర్థి గంటా శ్రీనివాసరావు నామినేషన్‌కి జనాల సమీకరణకు కార్యకర్తలు, నాయకులు అష్టకష్టాలు పడడమే కాకుండా అడుగడుగునా నిబంధనలు ఉల్లంఘించారు. మధురవాడ పరిసర ప్రాంతాల నుంచి జనం కరువవ్వడంతో రోజు కూలీ పనుల కోసం రోడ్డు పక్కన అడ్డాల్లో వేచి వుండే కూలీలతో బేరసారాలు నడిపి వారికి డబ్బులిచ్చి ర్యాలీకి తరలించారు. కొమ్మాది జంక్షన్, శివశక్తినగర్ పరిసర ప్రాంతాల నుంచి కూలీలకు డబ్బులిచ్చి తరలించారు. ఈ తతంగం చూసిన వారంతా ఇదేం కర్మంటూ బహిరంగంగానే విమర్శించారు.

కూటమిలో కొరవడిన ఐక్యత

గంటా శ్రీనివాసరావు జనసేన, టీడీపీ, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి అని చెప్పుకుంటున్నప్పటికీ నాయకులు, కార్యకర్తల మధ్య ఐక్యత నామమాత్రంగానే కనిపించింది. మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు వేర్వేరుగా జనాన్ని తరలించారు. ఇందుకోసం వాహనాలనూ వేర్వేరుగానే ఏర్పాటు చేసుకున్నారు. జనసేన నాయకులు తమ అభిమానులను మారికవలస జంక్షన్ నుంచి తరలించారు. వీరు మారికవలస జంక్షన్ వద్ద మాస్టర్ ప్లాన్ రోడ్డు మధ్యనే వాహనాలు పార్కింగ్ చేసి ప్రయాణికులు, వాహనదారులకు చోటివ్వకుండా ట్రాఫిక్‌కి తీవ్ర అంతరాయం కలిగించారు. దీంతో ఆ మార్గంలో రాకపోకలు సాగించిన వారు తీవ్ర అవస్థలు పడ్డారు. కూటమి నాయకుల తీరును అసహ్యించుకున్నారు.

అభివృద్ధి చేసిన వైఎస్సార్‌సీపీనే గెలిపించండి


ఎంఎస్ఆర్ లే అవుట్‌లో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రావణ్‌కుమార్, తదితరులు

మధురవాడ: మాటలు చెప్పడమే కాకుండా అభివృద్ధి చేసి చూపించిన వైఎస్సార్‌సీపీ అభ్యర్థులనే గెలిపించాలని ఆ పార్టీ నాయకులు ఐ.శ్రావణ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ న్యాయ విభాగం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గాదే రోశిరెడ్డి కోరారు. గురువారం సాయంత్రం జీవీఎంసీ 6 వార్డు ఎంఎస్ఆర్ లే అవుట్, సాయిప్రియ గార్డెన్ పరిసర ప్రాంతాల్లో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అపార్ట్‌మెంట్లు, నివాసాల వద్దకు వెళ్లి కరపత్రాలు అందజేశారు. గత ఐదేళ్లలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు, నియోజకవర్గంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు చేసిన అభివృద్ధిని వివరించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకునేందుకు, సంక్షేమ పాలన కొనసాగించేందుకు ప్రజలంతా సిద్ధంగా వున్నారన్నారు. ఫ్యాన్ గుర్తుపై ఓటేసి ఎమ్మెల్యేగా ముత్తంశెట్టి శ్రీనివాసరావును, ఎంపీగా బొత్స ఝాన్సీలక్ష్మిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షుడు బొట్ట అప్పలరాజు, నాయకులు సియాద్రి కనకరాజు, పోతిన సూరిబాబు, పిళ్లా రమణ, బి.ప్రసాద్, జి.చంద్రశేఖర్, అవతార్‌సింగ్, అల్తాఫ్, ఈశ్వరరావు, వరలక్ష్మి, అనూష, మురళి, తదితరులు పాల్గొన్నారు.

నొప్పిలేని సుఖ ప్రసవం కోసం ఏంటోనాక్స్


అధునాతన ఏంటోనాక్స్ పరికరం పనితీరు వివరిస్తున్న అనిల్ నీరుకొండ వైద్యులు

తగరపువలస: సంగివలస అనిల్ నీరుకొండ మెడికల్ సైన్సెస్ ప్రసూతి విభాగంలో ఏంటోనాక్స్ అనే అధునాతన పరికరాన్ని గురువారం పరిచయం చేశారు. ఈ సందర్భంగా డీన్ డాక్టర్ పీవీ సుధాకర్ మాట్లాడుతూ ఈ పరికరం ద్వారా నొప్పలేని సాధారణ ప్రసవాన్ని చేయవచ్చన్నారు. దీని ద్వారా సిజేరియన్ ఆపరేషన్లు గణనీయంగా తగ్గుతాయన్నారు. ఈ పరికరాన్ని ముగ్గురు మహిళలపై ప్రయోగించగా వారు ఆనందం వ్యక్తం చేశారన్నారు. విశాఖ పరిసర ప్రాంతాల్లో ఎక్కడా లేని నూతన ప్రక్రియ వల్ల తల్లులు నొప్పి లేకుండా సుఖ ప్రసవం పొందుతారన్నారు. ఈ పరికరం తయారీ కోసం శ్రమించిన వైద్యులు ఉమ, చైత్రలను అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీధరరెడ్డి, డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ సుజాత, రత్నకుమారి, పీడియాట్రిక్స్ విభాగాధిపతి డాక్టర్ ప్రతిమాదేవి, ప్రసూతి వైద్య విభాగాధిపతి డాక్టర్ ఉమ, పాథాలజీ విభాగాపతి డాక్టర్ భాగ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి స్మార్ట్ కంప్యూటింగ్‌పై అవగాహన సదస్సు


స్మార్ట్ కంప్యూటింగ్ అంతర్జాతీయ సదస్సు పోస్టర్లు ఆవిష్కరిస్తున్న అనిట్స్ ప్రతినిధులు

తగరపువలస: సంగివలస అనిట్స్‌లో సీఎస్ఈ, ఐటీ, సీఎస్ఎం, సీఎస్‌డీ విభాగాల ఆధ్వర్యంలో రెండు రోజులపాటు జరగనున్న స్మార్ట్ కంప్యూటింగ్ అంతర్జాతీయ అవగాహన సదస్సు శుక్రవారం ప్రారంభం కానుంది. దేశ, విదేశాల నుంచి 500కుపైగా పరిశోధన పత్రాలు ఈ సదస్సులో సమర్పించనున్నారు. స్ప్రింగ్‌లర్ భాగస్వామ్యంతో నిర్వహించనున్న ఈ సదస్సులో 90 పరిశోధన పత్రాలు ప్రచురించనున్నారు. దేశంలోని వివిధ విశ్వవిద్యాలయాల నుంచి ప్రతినిధులు సదస్సులో పాల్గొననున్నారు.

సుభోజనం కౌంటర్ పునరుద్ధరణకు శ్రీకారం


సుభోజనం కౌంటర్ పనులకు శంకుస్థాపన చేస్తున్న డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం. చిత్రంలో డాక్టర్లు అశోక్‌కుమార్, బుచ్చిరాజు, తదితరులు

మహారాణిపేట : కేజీహెచ్‌లో సుభోజనం కౌంటర్ పునరుద్ధరణకు గురువారం శంకుస్థాపన చేశారు. రోగుల సహాయకుల సంఖ్య రోజురోజుకు పెరగడంతో వారి కోసం సుభోజనం కౌంటర్ ఎదురుగా ఖాళీ స్థలంలో తాత్కాలిక షెడ్ నిర్మిస్తున్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ డీఎంఈ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం అంకురార్పణ చేశారు. గత 12 సంవత్సరాల నుంచి అల్పాహారం, రెండు పూటల భోజనాలు పెడుతున్న హరేకృష్ణ మూవ్‌మెంట్, టచ్‌స్టోన్ చారిటీస్‌కు ఒక ఏడాది కాలం పాటు అన్నదానం చేయడానికి ఇండో ఎంఐఎం సంస్థ ముందుకు వచ్చింది. ఈ రోజు నుంచి వచ్చే ఏడాది ఏప్రిల్ 17 వరకు రోజుకు 400 మంది రోగి సహాయకులకు భోజనం కోసం ఇండో ఎంఐఎం సంస్థ విరాళం ఇచ్చింది. ఈ కార్యక్రమాన్ని ఎంఐఎం కంపెనీ సీఈవో విజయకుమార్ గురువారం లాంఛనంగా ప్రారంభించారు. కంపెనీ ముఖ్య కార్యనిర్వహణాధికారి విజయ కుమార్, ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్, డిప్యూటీ సూపరింటెండ్ డాక్టర్ రాధాకృష్ణ, హరేకృష్ణ మూవ్‌మెంట్ అధ్యక్షుడు డాక్టర్ ఎన్. భక్తదాస, జాతీయ అవార్డు గ్రహీత ఆర్.రవికుమార్, యదురాజా దాస, గోపీశ్వర దాస, శ్యామా మాధవ దాస, జీతమిత్ర దాస, సమన్వయకర్త పి.షణ్ముఖరావు తదితరులు పాల్గొన్నారు.

ముత్తంశెట్టికి నాయీ బ్రాహ్మణుల మద్దతు


ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావును సత్కరిస్తున్న నాయీబ్రాహ్మణులు, వైఎస్సార్‌సీపీ నాయకులు

సింహాచలం: వైఎస్సార్‌సీపీ భీమిలి ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు 98వవార్డు పరిధిలోని నాయీ బ్రాహ్మణులు మద్దతు పలికారు. నగరంలోని ముత్తంశెట్టి స్వగృహంలో ఆయన్ను గురువారం నాయీ బ్రాహ్మణ సంఘం నాయకుడు సిరెల అప్పారావు,యువ నాయకుడు తెలగరాపు కుమార్ ఆధ్వర్యంలో 60 నాయీ బ్రాహ్మణ కుటుంబాలు ముత్తంశెట్టి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. అడవివరం నుంచి వీరంతా ప్రత్యేక బస్సులో ముత్తంశెట్టి ఇంటికి వెళ్లారు. వైఎస్సార్‌సీపీ వెంటే నాయి బ్రాహ్మణులమంతా ఉన్నామని, మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ముత్తంశెట్టిని భారీ మెజార్టీతో గెలిపిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా వారికి ముత్తంశెట్టి కృతజ్ఞతలు తెలిపారు. వెనుకబడిన వర్గాల వారిని ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి అక్కున చేర్చుకున్నారని తెలిపారు. సామాజికంగా, ఆర్థికంగా గుర్తింపులేని వెనుకబడిన బడుగు, బలహీన కుటుంబాలల్లో జగన్‌మోహన్ రెడ్డి వెలుగులు నింపారన్నారు. రాష్ట్రంలోని అన్ని దేవాలయాల ట్రస్ట్‌బోర్డు నియామకాల్లో నాయీ బ్రాహ్మణులకు అవకాశం కల్పిస్తూ చట్టం చేసి వారికి సముచిత స్థానం కల్పించిన ఘనత జగన్‌మోహనరెడ్డిదే అన్నారు. భవిష్యత్తులో నాయీ బ్రాహ్మణులంతా ఏకగ్రీవంగా సూచించిన వ్యక్తికే ట్రస్ట్‌బోర్డులో అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ముత్తంశెట్టిని కలిసినవారిలో నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు వెంపడపు శివరావు, టి.నరసింగరావు, చిప్పాడ అప్పలరాజు, గంట్రెడ్డి సూరిబాబు, చిప్పాడ సాయి, చిప్పాడ రఘు, మొలిపాక తరుణ, తెలగరాపు అప్పలరాజు, 98వవార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కొలుసు ఈశ్వరరావు, ఇన్‌చార్జి ఎర్ర వరహానరసింహం, అడవివరం కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి, నాయకులు ఎస్.అప్పారావు, ఎర్ర దీవి వరప్రసాద్, వైడీపీ ప్రసాద్, సాడి మధురెడ్డి, కొలుసు శ్రీను తదితరులు ఉన్నారు.

అప్రమత్తతతో ప్రమాదాల నివారణ


కార్మికులకు అవగాహన కల్పిస్తున్న చిట్టివలస అగ్నిమాపక సిబ్బంది

తగరపువలస: ఆనందపురం మండలం వెల్లంకిలోని సీ ఫుడ్స్ సంస్థ కార్మికులకు చిట్టివలస అగ్నిమాపక సిబ్బంది ప్రమాదాలపై గురువారం అవగాహన కల్పించారు. అగ్నిమాపక శాఖాధికారి జి.శ్రీనివాసరాజు మాట్లాడుతూ పని ప్రదేశంలో కార్మికులు ఎల్లప్పుడూ అప్రమత్తంగా వుంటే ప్రమాదాలు నివారించవచ్చన్నారు. ఈ సందర్భంగా అగ్నిమాపక పరికరాలను ప్రదర్శించి, వాటి పని తీరును వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.